# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

## ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతయ్..

ఉన్న మూడు గంటల కరెంటుల రైతులందరూ అన్ని మోటర్లు ఒక్కసారే ఏసుకుంటే లో వోల్టేజీ కాదా? 10 ఎస్పర్ మోటర్లు పెట్టుకుంటే ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా? యాడియాడ పేలిపోతయ్. మోటర్లు కాలిపోతయ్. అవి రిపేర్లు చేసి పెట్టేందాక పొలాలు ఆగుతయా.. మొత్తం ఎండిపోతయ్. మోటర్లను మంచిగ చేసుకునతందుకు నెలకోసారి పైసల్ యాడికెళ్లి తేవాలె. రైతుల మీద కాంగ్రెస్‌కు గంతగానం పగ ఎందుకు? మేం మంచిగ బతుకుడు ఇష్టం లేదా?

-బాస సాయిలు, బిచ్కుంద



## కష్టాలు కొని తెచ్చుకోవద్దు

మూడు గంటల కరెంటు సరిపోతది అంటున్న కాంగ్రెసోళ్ల మాటలకు రైతులు మోస పోవద్దు. కాంగ్రెస్ కరెంటుతోని రైతులు ఎన్నో కష్టాలు చూశారు. పొలాలు ఎండిపోయి పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాక అప్పులైతుండె. అప్పుల బాధకు రైతులు ఉరేసుకున్నరు. కాంగ్రెస్ పార్టీతో గోసవడ్డ రోజులు ఇంకా మర్చిపోలేదు. మళ్లీ 3 గంటల కరెంటిస్తం.. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోండి అని చెప్తున్నరు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే రైతులను నిండా ముంచుతరు. రాత్రి కరెంటు.. పొద్దున కరెంటు అని ముప్పుతిప్పలు పెడ్తరు. రైతులు పొరపాటున కూడా కాంగ్రెస్‌ను గెలిపించి కష్టాలను కొని తెచ్చుకోవద్దు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు ఎలాంటి బాధలు లేవు.

-బాల్‌రాజ్, పిట్లం





## కరెంటు తీసేస్తే ఆగమైతం..

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడుకూడా సరిగ్గా కరెంట్ ఇవ్వలేదు. బోరు మోటర్లకాడ పడిగాపులు కాసేటోళ్లం. బీఆర్‌ఎస్ సర్కారు వచ్చినంకనే 24 గంటల కరెంట్ ఇస్తున్నది. కాంగ్రెస్ నాయకులు 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్ అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కరెంటు తీసేస్తే మా రైతుల బతుకులు ఆగమైతయ్. కాంగ్రెస్ వద్దు.. కరెంటు కట్ చేసుడు వద్దు.

-రాములు, కందర్‌పల్లి, బిచ్కుంద మండలం



## కష్టాలు తెచ్చే కాంగ్రెస్ వద్దు..

పదేండ్ల నుంచి ఎలాంటి బాధలు లేకుండా హాయిగా పంటలు పండిస్తున్నం. రైతులకు సీఎం కేసీఆర్ 24 గంటలపాటు ఫ్రీగా కరెంట్ ఇస్తున్నడు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే 3 గంటలే కరెంట్ ఇస్తరంట. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని పొలం పారియ్యాల్నంట. దిమాక్ ఉన్నోడు ఎవడైనా మంచిగున్న కరెంటును పాడుచేసుకుంటడా? కేసీఆర్‌ను వద్దనుకొని కష్టపెట్టె కాంగ్రెస్‌కు ఓటేస్తరా? లక్షలల్ల పెట్టుబడి పెట్టి మొదటికెళ్లి వ్యవసాయం చేయాలంటే రైతులతోని అయితదా? కాంగ్రెస్‌ను నమ్మడం కన్నా ఎవుసం మానెయ్యడం మేలు.

-సుభాష్‌పటేల్, చిన్నతక్కడపల్లి, పెద్దకొడప్‌గల్ మండలం

## మూడు గంటల కరెంట్‌తో మళ్లీ గోసనే..

సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో రైతులు సంతోషంగా ఎవుసం చేసుకుంటున్నరు. కరెంటు పోతదనే బాధనే లేదు. పొలంలో తడి లేనప్పుడల్లా మోటర్ ఏసుకుంటున్నం. కాంగ్రెస్ సర్కారు వస్తే 3 గంటలే కరెంటు ఇస్తదంట. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని పొలం పారియ్యాల్నంట. గంత పెద్ద మోటర్లు పెడితే భూమిల నీళ్లు కాదు.. దుమ్మే వస్తది. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ 24 గంటల ఫ్రీ కరెంట్ ఇస్తున్నడు. ఇది వద్దనుకొని 3 గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్‌కు ఓటేస్తమా.. కష్టాలు కోరి తెచ్చుకుంటమా..మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రావాలి.

-ఆవార్ శ్రీనివాస్, బిచ్కుంద



## కాంగ్రెస్ మన కొంపలు ముంచుతది..

పదేండ్ల నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు చాలా మంచి పథకాలు ఇస్తున్నది. 24 గంటల ఫ్రీ కరెంటుతో చాలా వరకు ఇబ్బందులు దూరమైనయ్. కాపుదానం పని వదులుకొని పట్నాలకు పోయినోళ్లంతా ఎవుసం చేసుకునేందుకు మళ్లా ఊళ్లకు వచ్చేస్తున్నరు. పల్లెలన్నీ పచ్చటి పంటలతోని కళకళలాడుతున్నయ్. రైతుల ముఖంలో ఇప్పుడిప్పుడే కొంచెం తెలివి కనిపిస్తున్నది. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే ఉన్న కరెంటును ఊడగొడ్తదంట. పొద్దూమాపూ చేన్ల కాడనే కావలి గాయాలె. 3 గంటల కరెంటుతోని రైతులు ఎవుసం చేయలేరు. అద్దెకరం కూడా పారది. పెట్టుబడి చేతికి రాదు. అప్పులపాలై మళ్లీ కూలీ పని చేసుకోవాలె. కాంగ్రెస్ నాయకులు మన కొంపలు ముంచుతరు.

-మద్దెల నవీన్, పిట్లం





## ఎవుసం ఆగమైపోతది..

**మూడు గంటల** కరెంటు, 10 ఎస్పర్ మోటర్లతో ఎవుసాన్ని ఆగం చేసుకునుడే. లక్షల పెట్టుబడి యాడికెళ్లి తేవాలె. మళ్లా అప్పులు జేయాల్నా? ఎండ్లన్నా పడి సావుమంటరా? కాంగ్రెసోడు మూడు గంటలే కరెంటు ఇస్తండట. ఆ మూడు గంటల కోసం ఎదురుసూడాల్నా? లోడ్‌వెరిగి మోటర్లు కాలుడు.. రిపేర్లకు పైసల్ పెట్టుడు.. ఎవుసం ఇడ్సవెట్టి మేం ఎటని తిరగాలె? అంతా ఆగమైపోతది. కేసీఆర్ సర్కారు తిప్పలు పెట్టకుండా 24 గంటల కరెంటు ఇస్తున్నది. ఎప్పుడు తడి లేకపోతే అప్పుడు నీళ్లు పారిస్తున్నం.

-భజనల్‌లాల్, పెద్ద దేవీసింగ్‌తండా, పెద్దకొడప్‌గల్ మండలం



## రాత్రి కరెంటుతోని పానాలు పోగొట్టుకోవాల్నా?

గతంలో పాలించిన ప్రభుత్వాలు కరెంటు కోసం చాలా ఇబ్బందులు పెట్టినయ్. అప్పట్ల కరెంటు ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వకుండె. ఎండా, వానా, రాత్రి, పగలు అనకుండా కరెంటు కోసం ఎదురుచూసేటోళ్లం. అర్ధరాత్రి చేనుకాడికి పోయి కరెంటు కోసం నిద్ర కాసుకొని చూసెటోళ్లం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చినంక రైతులకు మంచి కరెంటు ఇస్తున్నది. 24 గంటలు కరెంటు ఉంటున్నది. పదేండ్ల సంది రాత్రి పూట పొలానికి పోవుడంటే ఏందో తెల్వదు. మళ్లీ కాంగ్రెసోళ్లు వచ్చి మూడే గంటలు కరెంటిస్తమని అంటే.. రైతులు బతుకుతరా? రాత్రి కరెంటుతోని పానాలు పోగొట్టుకోవాల్నా? కాంగ్రెస్ సర్కారు వస్తే మళ్లా ఎవుసమంతా ఆగమాగం అయితది.

-మహిపాల్‌రెడ్డి, కుర్తి, పిట్లం మండలం